దోమల నివారణకు మై జీహెచ్ఎంసీ యాప్

ప్రయోగాత్మకంగా జూబ్లీహిల్స్ సర్కిల్‌లో అమలు

సిటీబ్యూరో, మార్చి 20(నమస్తే తెలంగాణ): జీహెచ్ఎంసీలో దోమల నివారణకు చేసే ఫాగింగ్ ప్రక్రియను డిజిటలైజ్డ్ చేశారు. ఫాగింగ్ జరిగే ప్రాంతాల సమయం వృథా కాకుండా సమస్య ఆధారంగా పరిష్కరించడానికి వీలుగా పౌరులే ఫాగింగ్‌కు అభ్యర్థించేలా 'మై జీహెచ్ఎంసీ' మొబైల్ యాప్‌లో ఫాగింగ్ రెక్వెస్ట్ పెట్టేందుకు వీలుగా వెసులుబాటు కల్పించారు. ఎక్కడైతే ప్రధానంగా దోమల బెడద ఉంటుందో అక్కడ ఏ పౌరుడైనా ఈ యాప్ లాగిన్ అయి రిక్వెస్ట్ చేయొవచ్చని అధికారులు తెలిపారు. వారి లొకేషన్, రిక్వెస్ట్ ఆటోమేటిక్‌గా ఆఫీసర్‌గా చేరుతుందన్నారు.ఎంటమాలజిస్ట్ ఆ వర్కర్‌కు అసైన్డ్ చేస్తారన్నారు. ఫాగింగ్ చేస్తున్న ఫొటో లాటిట్యూట్, లాంగిట్యూడ్‌తో సహా అప్‌లోడ్ చేసి పరిష్కారమైందని అప్డేట్ చేస్తారన్నారు. జీహెచ్ఎంసీలో ఉన్న ఫాగింగ్ వర్కర్స్‌కు తగినన్ని స్లాట్స్ అందుబాటులో ఉంటాయన్నారు. మొదటగా జూబ్లీహిల్స్ సర్కిల్‌లో ప్రయోగించి ఫలితాలను బట్టి జీహెచ్ఎంసీ మొత్తానికి విస్తరించనున్నారు.

ఓవర్సీస్ స్కాలర్‌షిప్ దరఖాస్తులకు ఆహ్వానం

సిటీబ్యూరో/మేడ్చల్: విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు అందించే ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌నిధికి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. దీనికి అర్హులైన విద్యార్థులకు రూ.20లక్షలు ఆర్థిక సాయం అందించనున్నట్లు హైదరాబాద్ జిల్లా ఎస్సీ కులాల అభివృద్ధి శాఖ ఏడీ గురువారం తెలిపారు. విద్యార్థి కుటుంబ వార్షిక ఆదాయం రూ.5లక్షల లోపు ఉండాలని, అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా, జర్మనీ,ఫ్రాన్స్, కెనడా వంటి దేశాల్లో గ్రాడ్యుయేషన్/పోస్ట్-గ్రాడ్యుయేషన్ చేసే విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. విద్యార్థి జీఆర్ఈ/జీమ్యాట్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి ఉండాలని తెలిపారు. https://telanganaepass.cgg.gov.in వెబ్‌సైట్‌లో మార్చి 20 నుంచి మే 19వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

గురువారం హరిత ప్లాజా హోటల్‌లో జరిగిన 72వ మిస్ వరల్డ్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న మిస్ వరల్డ్ క్రిస్టినా పిజ్కోవా. ఈ సందర్భంగా ఆమె అక్కడున్న ఓ చేనేత మగ్గాన్ని అడిస్తున్న దృశ్యం

శాసనమండలిలో ఉద్యమకారుల అంశంపై మాట్లాడాలి

ఎమ్మెల్సీ కవితకు తెలంగాణ ఉద్యమకారుల ఫోరం వినతి

సికింద్రాబాద్, మార్చి 20: శాసనమండలిలో ఉద్యమకారుల అంశంపై మాట్లాడాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకులు వినతిపత్రం సమర్పించారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్ ఆదేశానుసారం రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లురి అనిల్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం ఎమ్మెల్సీ కవితను వారి నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పొందుపరిచిన అంశం తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, పెన్షన్ మంజూరు చేస్తామని హామీలు ఇచ్చారని, కాని నేటి ప్రారంభించలేదని, కావున ఈ శాసనమండలి సమావేశాల్లో ఉద్యమకారుల హామీల అంశాన్ని ప్రస్తావించి ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రకటన చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు జానకి రెడ్డి, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కొంతం యాదిరెడ్డి, దక్షిణ తెలంగాణ మహిళా విభాగం అధ్యక్షురాలు శ్యామల, గ్రేటర్ హైదరాబాద్ కన్వీనర్ జగన్ యాదవ్, బాబూలాల్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ కవితను కలిసిన నాయకులు

డిస్కం స్టోర్స్‌లో ఆటోవాలా మెటీరియల్ దందా

- ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్‌కు అదనపు చెల్లింపులు
- ఆటోల దందాపై కాంట్రాక్టర్ల ఫిర్యాదు
- ఉద్యోగుల ప్రమేయంపై ఆరా తీసిన సీఎండీ
- బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ

సిటీబ్యూరో, మార్చి 20(నమస్తే తెలంగాణ): అసలే ఎండాకాలం.. అప్రకటిత కరెంట్ కోతలతో పంటలు ఎండిపోతున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయి. కొన్నిచోట్ల అదనపు లోడ్‌తో కొత్తవి అవసరమవుతున్నాయి. అయితే కరెంట్ సరఫరాలో అంతరాయాలు అటు వినియోగదారులకు, ఇటు కాంట్రాక్టర్లకు చాలా ఇబ్బందులు తెచ్చిపెడుతున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలంటే దక్షిణ డిస్కంకు డీడీ చెల్లించి ఆ తర్వాత తమ నంబర్ వచ్చినప్పుడు వర్క్ ఆర్డర్ తీసుకుని మెటీరియల్ తెచ్చుకోవాలి. ఇందుకోసం ఏఈ, డీఈలతో పాటు లైన్‌మన్ తదితర సిబ్బంది సర్టిఫై చేయాలి. అయితే తాము డీడీలు కట్టి నెలలు గడిచినా మెటీరియల్ రావడం లేదంటూ గత కొన్ని రోజులుగా కాంట్రాక్టర్లు, వినియోగదారులు చెబుతున్నారు. కానీ స్టోర్స్‌లో మాత్రం వచ్చిన మెటీరియల్ వచ్చినట్లే మాయం అవుతున్నది. ఈ వ్యవహారమంతా అధికారుల కనుసన్నల్లో మెటీరియల్ రవాణా చేసే గూడ్స్ ఆటోడ్రైవర్ల ద్వారా జరుగుతున్నట్లు కాంట్రాక్టర్లు గుర్తించారు. ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్ కు కొందరి దగ్గర రూ.5వేల నుంచి రూ.12వేల వరకు వసూలు చేసి డిస్కం స్టోర్స్ వద్ద అన్ని పనులు తామే చేసుకుని వెళ్తున్నట్లు కాంట్రాక్టర్లు గమనించారు. ఈ నేపథ్యంలో స్టోర్స్‌లో మెటీరియల్ పక్కదోవ పడుతుందని, నిన్ననే ఆర్డర్ ఇచ్చి ఇవాళనే మెటీరియల్ ఇస్తున్నారని, తాము ఎన్ని రోజుల నుంచి ఎదురు చూసినా పనులు కావడం లేదని, అధికారులకు ముడుపులివ్వడంలో ఆటోవాలాలే కీలకపాత్ర పోషిస్తున్నారంటూ మేడ్చల్- మల్కాజిగిరి ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మహేందర్ ఆధ్వర్యంలో తెలంగాణ ఎలక్ట్రికల్ లైసెన్స్ బోర్డు మాజీ సభ్యుడు నక్కయాదగిరి, కనకాచారి, విష్ణువర్ధన్‌రెడ్డిలతోపాటు పలువురు కాంట్రాక్టర్లు రెండురోజుల కిందట టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖికి ఫిర్యాదు చేశారు. డిస్కం స్టోర్స్‌లో జరుగుతున్న దందాపై సీఎండీకి సాక్ష్యాలతో సహా వివరించడంతో ఆయన అప్పటికప్పుడే సంబంధిత అధికారులను పిలిచి తన చాంబర్‌లో ఈ వ్యవహారంపై చర్చించారు. అసలు స్టోర్స్‌లో ఎంత మెటీరియల్ ఉన్నది? ఎంతమంది డీడీలు కట్టారు..? సీరియల్ నంబర్ ఏం నడుస్తున్నది?.. వంటి విషయాలపై ఆరా తీశారు. అయితే 420మంది డీడీలు కడితే కేవలం పది ట్రాన్స్‌ఫార్మర్లు మాత్రమే ఉన్నాయని స్టోర్స్ నిర్వాహకులు తెలిపారు. దీనిపై సీఎండీ సీరియస్ అవ్వడంతో పాటు వెంటనే 300 డీటీఆర్‌లు తెప్పించాలని ఆదేశించారు. అంతేకాకుండా 4 నెలలుగా స్టోర్స్‌లో సీటీపీటీలు, కండక్టర్లు,120 సింగిల్ కేబుల్ మెటీరియల్ దొరకడం లేదని, బయటకు మాత్రం మెటీరియల్ ఉన్నట్లు చెబుతున్నా.. ఓ అండ్ ఎం సిబ్బంది వల్ల కొందరికి మాత్రమే అందుతున్నదని, దీనిపై కూడా దృష్టి పెట్టి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని కాంట్రాక్టర్లు డిమాండ్ చేశారు. అసలు డిస్కంకు సంబంధం లేని ఆటోవాలాలు ట్రాన్స్‌పార్మర్ల దందా కొనసాగిస్తున్నారని వారు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. తాము నెలల తరబడి వేచిచూస్తున్నా తమకు మెటీరియల్ అందడం లేదని, కేవలం ఆటోవాలాలు చెబితే ఒక్కొక్కరికి ఐదు నుంచి పది వరకు ట్రాన్స్‌ఫార్మర్లు ఇస్తున్నారని, మొత్తం నాలుగు ఆటోల్లో ఈ దందా నడుస్తున్నదని కాంట్రాక్టర్లు సీఎండీకి చెప్పారు. దీనితో లక్ష రూపాయల వరకు వస్తున్నదని, వీటిని అక్కడున్న సిబ్బంది, అధికారులు పంచుకుంటూ సీరియల్ నంబర్లను వదిలేశారని చెప్పారు. మొత్తం విడుదల చేసే మెటీరియల్‌లో మెజారిటీ వస్తువులను ఇదే తరహాలో అక్రమంగా ఇస్తూ కొంత మెటీరియల్‌ను సీరియల్ నంబర్లలో ఇస్తుండటంతో తమకు రావడానికి నెలల సమయం పడుతున్నదని, దీంతో క్షేత్రస్థాయిలో తమకు చాలా సమస్యలు వస్తున్నాయని కాంట్రాక్టర్లు సీఎండీ ముషారఫ్‌కు చెప్పారు. దీనిపై ముషారఫ్ ఫరూఖి సీరియస్‌గా స్పందించారు. ఒకవైపు సమ్మర్‌లో చాలా డిమాండ్ ఉన్న పరిస్థితుల్లో మెటీరియల్ విషయంలో ఎందుకు అలసత్వం వహిస్తున్నారంటూ సీజీఎంపై సీరియస్ అయ్యారు. వెంటనే స్టాక్ రిజిస్టర్ తెప్పించుకుని వివరాలు తీసుకుని మెటీరియల్ డిస్పాచ్‌మెంట్ సరిగా జరగాలని ఆదేశించారు. ఈ దందాకు బాధ్యులైన వారిని గుర్తించి తనకు నివేదిక ఇవ్వాలని సీజీఎంను ముషారఫ్ ఆదేశించారు.

మల్లారెడ్డి విశ్వవిద్యాపీఠ్ వార్షిక ఏకత్వ దినోత్సవం సందర్భంగా కేక్‌కట్ చేస్తున్న మాజీ మంత్రి మల్లారెడ్డి దంపతులు. పాల్గొన్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, సినీ నటుడు విజయ్ దేవరకొండ

తల్లిదండ్రుల మాటలు వినాలి

మల్లారెడ్డి విశ్వవిద్యాపీఠ్ వార్షిక ఏకత్వ దినోత్సవంలో విజయ్ దేవరకొండ

మేడ్చల్, మార్చి20(నమస్తే తెలంగాణ): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సూరారంలోని మల్లారెడ్డి క్రికెట్ గ్రౌండ్‌లో విశ్వవిద్యాపీఠ్ వార్షిక ఏకత్వ దినోత్సవం మల్లారెడ్డి యూనివర్సిటీ విద్యార్థుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి, ఎమ్మెల్యే కేపీ వివేకానంద, సినీ నటులు విజయ్ దేవరకొండ, నితిన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మల్లారెడ్డి దంపతులు కేక్‌కట్ చేశారు. అనంతరం సినీ నటుడు విజయ్ దేవరకొండ మాట్లాడుతూ.. ఈ వయసులో తల్లిదండ్రుల మాట వినడం ముఖ్యమని, వారు చెబుతున్నది మన కోసమే అని గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాపీఠ్ చైర్మన్ డాక్టర్ భద్రా రెడ్డి, వైస్ చైర్మన్ ప్రీతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

1,76,789 మంది విద్యార్థులు.. 837 పరీక్ష కేంద్రాలు

నేటి నుంచి పదో తరగతి పరీక్షలు

హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో సెంటర్లు ఏర్పాటు

సిటీబ్యూరో, మార్చి 20 (నమస్తే తెలంగాణ): పదో తరగతి పరీక్షలు ఈనెల 21వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో 1,76,789 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్ష జరుగుతుంది. ఈ పరీక్షల కోసం సంబంధిత విద్యాశాఖాధికారులు హైదరాబాద్‌లో 358 సెంటర్లు, మేడ్చల్‌లో 230 సెంటర్లు, రంగారెడ్డిలో 249 పరీక్షా సెంటర్లు ఏర్పాటు చేశారు. కాగా, గతంలో నిమిషం ఆలస్యంగా వచ్చినా అనుమతించే వారు కాదు. అయితే ఈ నిబంధనను ప్రభుత్వం కొంతమేర సడలించిన విషయం తెలిసిందే. విద్యార్థులకు కొంత వెసులుబాటు కల్పిస్తూ పరీక్ష రాసే విద్యార్థులకు గ్రేస్ పిరీయడ్ కల్పించింది. దీని ద్వారా పరీక్ష సమయం కంటే ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చినా విద్యార్థులను పరీక్ష హాల్‌లోకి అనుమతించనున్నారు. అయితే విద్యార్థులు అరగంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకునేల ప్రణాళిక చేసుకోవాలని అధికారులు సూచించారు. నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని సంబంధిత సెంటర్లకు చేరుకోవాల్సి ఉంటుందని, ఆలస్యంగా వెళితే టెన్షన్ పడాల్సి వస్తుందని చెప్పారు. ప్రశాంతంగా పరీక్ష రాసేల ముందే చేరుకోవాలని సూచించారు. భౌతిక శాస్త్రం, జీవశాస్త్రం పరీక్షలు మాత్రం ఉదయం 9:30 నుంచి 11 గంటల వరకు కొనసాగనున్నాయి. కాగా, హైదరాబాద్ జిల్లాలో 77,701 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని, జిల్లాలో 358 సెంటర్లను ఏర్పాటు చేసినట్టు జిల్లా విద్యాశాఖ అధికారి డి. రోహిణీ తెలిపారు. రెగ్యులర్ విద్యార్థులు 74,100 మంది ఉండగా.. ఒకసారి ఫెయిల్ అయి మళ్లీ పరీక్ష రాస్తున్నవారు 3,601 మంది విద్యార్థులు ఉన్నారని చెప్పారు. ఈ సారి రెగ్యులర్‌లో 38,003 మంది బాలికలు, 36,097 మంది బాలురు హైదరాబాద్‌లో పరీక్ష రాయనున్నారు. కాగా, పరీక్షలు ఈ నెల 21న ప్రారంభమై ఏప్రిల్ 2వ తేదీ వరకు కొనసాగుతాయి.

సికింద్రాబాద్‌లోని ఓ పాఠశాలలో టెన్త్ హాల్‌టికెట్ నంబర్లు వేస్తున్న సిబ్బంది

విద్యార్థులు ఇలా..!	
హైదరాబాద్	77,701
మేడ్చల్	47,322
రంగారెడ్డి	51,766
మొత్తం	1,76,789

రాజ్‌భవన్‌లో విశ్వసుందరీల అందాలను ప్రశంసిస్తరా?

సిటీబ్యూరో, మార్చి 20(నమస్తే తెలంగాణ): మిస్ వరల్డ్ అందాల పోటీల పేరున హిందువుల పుణ్యక్షేత్రాలైన యాదగిరిగుట్ట, రామప్ప దేవాలయ పరిసరాల్లో ఎటువంటి కార్యక్రమాలు నిర్వహించినా హిందూ సమాజం అడ్డుకుంటుందని యాంటీ టెర్రరిజం ఫోరం చైర్మన్, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ్ సమితి సెక్రటరీ డాక్టర్ రావినూతల శశిధర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జూన్ 2వ తేదీన తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించిన రోజని, విద్యార్థులు, యువత ఆత్మబలిదానాలు, త్యాగాలు చేసి రాష్ట్రాన్ని సాధించుకున్న రోజు అని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జూన్ 2వ తేదీన రాజ్‌భవన్‌లో మిస్ వరల్డ్ మీట్ కార్యక్రమం నిర్వహించడం దారుణమని చెప్పారు. ఆరోజు తెలంగాణ చరిత్ర, రాష్ట్ర ఏర్పాటు త్యాగాలు స్మరించుకోవాల్సిన రాజ్‌భవన్‌లో ప్రభుత్వం విశ్వసుందరీమణుల అందాలను ప్రశంసించదలుచుకన్నదా? అని ఆయన విమర్శించారు.

కుల సర్వేపై నిపుణుల కమిటీ తొలి సమావేశం

రాష్ట్రంలో సామాజిక, విద్య, ఆర్థిక, రాజకీయ, కుల సర్వేను అధ్యయనం చేయడం, విశ్లేషించడం, అర్థం చేసుకోవడం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్వతంత్ర నిపుణుల కమిటీ గురువారం హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో తన తొలి సమావేశాన్ని నిర్వహించింది. ఈ సమావేశానికి రిటైర్డ్ న్యాయమూర్తి సుదర్శన్ రెడ్డి అధ్యక్షత వహించగా, ప్రొఫెసర్ కంచ ఐలయ్య ఉపాధ్యక్షుడిగా, శ్రీ ప్రవీణ్ చక్రవర్తి కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వహించారు. *- సిటీబ్యూరో, మార్చి20 (నమస్తే తెలంగాణ)*

ల్యాబ్‌టాప్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

పేదలను ఆదుకోవడంలో ముందుండాలి

ఉప్పల్, మార్చి 20 : బీఆర్ఎస్ నాయకుడు గుడి మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చేతుల మీదుగా చిలుకానగర్ డివిజన్ కుమ్మరి కుంటకి చెందిన బీఆర్ఎస్ పార్టీ నిరుపేద కార్యకర్త విజయ కుమారుడికి ఇంజినీరింగ్ చదువు నిమిత్తం ల్యాప్ టాప్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ .. పేద ప్రజలకు సేవ చేయాలని, మానవసేవే-మాధవసేవని తెలిపారు. ఈ సందర్భంగా గుడి మధుసూదన్ రెడ్డి ని అభినందించారు. కార్యక్రమంలో చిలుకానగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, ఉద్యమకారులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ తీసుకురావాలి

న్యాయవాదుల రక్షణ కోసం అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ తీసుకురావాలని తెలంగాణ న్యాయవాదుల సురక్షా సమితి నాయకులు డిమాండ్ చేశారు. తెలంగాణ న్యాయవాదుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ న్యాయవాదుల సురక్షా సమితి ఆధ్వర్యంలో గురువారం ఇందిరాపార్కు వద్ద రిలే నిరాహార దీక్ష చేపట్టారు. న్యాయవాదుల సురక్షా సమితి అధ్యక్షులు అశోక్, ప్రధాన కార్యదర్శి అహ్మద్‌పాషా, ఉపాధ్యక్షులు ఎ.సత్యనారాయణలు పాల్గొన్నారు. *- కవాడిగూడ, మార్చి 20*

బీసీలంతా ఏకం కావాలి

రాష్ట్ర సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరీ శంకర్

కార్యక్రమంలో మాట్లాడుతున్న జూలూరు గౌరీ శంకర్

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 20: రాష్ట్రంలో తమ హక్కుల సాధన కోసం బీసీలంతా ఏకం కావాలని రాష్ట్ర సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరీ శంకర్ పిలుపునిచ్చారు. పార్టీలకతీతంగా నాయకులంతా ఏకతాటిపైకి రావాలని సూచించారు. ఉస్మానియా యూనివర్సిటీ బీసీ సెల్, మహాత్మా జ్యోతిబాపూలే రీసెర్చ్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో 'సామాజిక రాజకీయ ఆర్థిక విద్యాపరమైన బీసీల స్థితిగతులు - రాజ్యాంగ ఆవశ్యకత' అనే అంశంపై ఒక రోజు జాతీయ సదస్సు నిర్వహించారు. ఓయూ సైన్స్ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన ఈ సదస్సుకు బీసీ సెల్ డైరెక్టర్ డాక్టర్ జి.ఉపేందర్ అధ్యక్షత వహించగా, జూలూరు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఓయూ బీసీ అధ్యాపకుల సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రంలోని బీసీ అధ్యాపకులు అందర్నీ ఒక్క దగ్గరికి చేర్చే గురుతర బాధ్యతను చేపట్టాలని కోరారు. బీసీలలో పెరిగిన అవగాహనను ఆచరణ రూపంలోకి తీసుకుపోయేందుకు ఓయూ కీలక పాత్ర పోషించాలని కోరారు. కార్యక్రమంలో బీసీ కమిషన్ సభ్యురాలు బాలలక్ష్మి, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి. ప్రభాకర్, హెచ్‌సీయూ ప్రొఫెసర్ జి.నాగరాజు, హైకోర్టు న్యాయవాది కొండలరావు, ప్రొఫెసర్ సిహెచ్ శ్రీనివాస్ తదితరులు ప్రసంగించారు. సదస్సు ముగింపు కార్యక్రమానికి ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేశ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకాగా, ఎస్సీ, ఎస్టీ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ డైసీ, అంబేద్కర్ రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్ ప్రొఫెసర్ విష్ణుదేవ్, మైనార్టీ సెల్ డైరెక్టర్ డాక్టర్ హమీదా బేగం, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఖాసీం, సివిల్ సర్వీసెస్ అకాడమీ డైరెక్టర్ డాక్టర్ కొండా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్లకు మెడ్ ఫ్లాష్ యాప్‌పై అవగాహన

జలమండలిలో హెల్త్ కార్డు కలిగిన ఉద్యోగులు, పెన్షనర్లకు సులభతరమైన ఆరోగ్య సేవలు అందించడానికి రూపొందించిన మెడ్ ఫ్లాష్ అప్లికేషన్ పై గురువారం ఈడీ మయాంక్ మిట్టల్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇప్పటికే ఉద్యోగులకు దీనిపై అవగాహన కల్పించగా.. తాజాగా పెన్షనర్లకు సైతం అప్లికేషన్ వినియోగం గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పీ అండ్ ఏ సీజీఎం మహమ్మద్ అబ్దుల్ ఖాదర్, ప్రావిడెన్స్ ఇండియా ఇన్సూరెన్స్ బ్రోకింగ్ కంపెనీ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ జ్యోతి బాల, పెన్షనర్లు పాల్గొన్నారు. *- సిటీబ్యూరో, మార్చి 20(నమస్తే తెలంగాణ)*

చేనేతలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న చేనేత వర్గాల చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చిక్కా దేవదాసు

చిక్కడపల్లి, మార్చి 20:కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో చేనేత వర్గానికి నిరాశ మిగిలిందని చేనేత వర్గాల చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చిక్కా దేవదాసు అన్నారు. బుధవారం చిక్కడపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు రాజకీయ పార్టీలు, పాలకులు చేనేతల పట్ల మొదటి నుంచి కపట ప్రేమ చూపిస్తున్నారని వాపోయారు. చేనేత, పవర్ లూమ్, కార్మికుల అభివృద్ధి కోసం 2025-26 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్లో నిధులు కేటాయించకుండా మొండిచేయి చూపిందని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన ఏ ఒక్క హామీ నెరవేర్చకపోగా ఈ బడ్జెట్లో కేవలం 371 కోట్లు మాత్రమే చేనేత, పవర్లు పరిశ్రమలకు కేటాయించి ప్రభుత్వం చేనేతలను మోసం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో శ్రీధర్, లక్ష్మి, గీత, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

చెరువుల రక్షణపై జీహెచ్ఎంసీ దిద్దుబాటు చర్య

- హైకోర్టు ఆదేశాలతో స్పందించిన అధికారులు
- తొలుత 11 చెరువులపై దృష్టి
- టెక్నికల్ కన్సల్టెంట్‌గా నీరి నియామకం
- స్టాండింగ్ కమిటీ ముందుకు ప్రతిపాదన

సిటీబ్యూరో, మార్చి 20 (నమస్తే తెలంగాణ): జీహెచ్ఎంసీ పరిధిలోని చెరువుల పరిరక్షణలో జీహెచ్ఎంసీ నిర్లక్ష్యంపై హైకోర్టు ఆక్షింతలు వేసిన నేపథ్యంలో దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించారు. టెక్నికల్ కన్సల్టెంట్‌గా నీరి (జాతీయ పర్యావరణ, ఇంజినీరింగ్ పరిశోధన సంస్థ)ని నియమించుకుని చెరువుల నీటి నాణ్యతను ఎప్పటికప్పుడు పరీక్షలు జరపడంతో పాటు ఇరిగేషన్ సమన్వయంతో సంబంధిత చెరువుల ఆక్రమణలకు గురికాకుండా పక్కాగా పరిరక్షణ చర్యలకు సిద్ధమైంది. ఇందు కోసం రూ. 55 లక్షలు ఖర్చు చేయనున్నారు. ఈ మేరకు వచ్చే వారంలో జరిగే స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఈ ప్రతిపాదనను సభ్యుల ముందు పెట్టి ఆమోద ముద్ర పొందిన తర్వాత క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టనున్నట్లు సంబంధిత అధికారి ఒకరు తెలిపారు.రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల పరిధిలో 13 చెరువులు అక్రమణలకు గురవుతున్నాయని, పరిరక్షణ విషయంలో జీహెచ్ఎంసీ చర్యలు తీసుకోవడం లేదన్న 'గమన' స్వచ్ఛంద సంస్థ ఈడీ దయాకర్ ఫిటీషనర్ సమగ్ర విచారణ చేపట్టిన న్యాయస్థానం జీహెచ్ఎంసీకి మొట్టికాయ వేస్తూనే 13 చెరువుల దయనీయస్థితిపై హైకోర్టు ఇద్దరు కోర్టు కమిషనర్ల కమిటీని నియమించి విచారణ జరిపించింది. న్యాయవాదులు ప్రవీణ్ కుమార్, శ్రీకాంత్ రెడ్డి సభ్యులుగా నియమితులైన ఈ కమిటీ.. జీహెచ్ఎంసీ అధికారులు, హైదరాబాద్ , రంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు చెరువుల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలేమిటన్నది పరిశీలించింది. జంట జిల్లాల్లోని 13 చెరువులను పరిశీలించి తమ నివేదికను ఇటీవల హైకోర్టుకు సమర్పించింది. రక్షణ చర్యలు చేపట్టకపోవడం వల్లే చెరువులు ఆక్రమణకు గురయ్యాయని హైకోర్టుకు సమర్పించిన నివేదికలో పేర్కొంది. ఈ చెరువుల కాలుష్యం కేవలం పర్యావరణానికి మాత్రమే కాకుండా.. ప్రజా ఆరోగ్యానికి కూడా త్రీవ ముప్పుగా పరిణమించే అవకాశాలున్నాయని తెలిపింది. ఆక్రమణలు, కాలుష్యం కారణంగా చెరువులపై ఆధారపడిన పక్షులు, జంతుజాలం, జలచరాలు అంతరించిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. ఇందులో భాగంగానే హస్మత్‌పేట బోయిని చెరువు, చందానగర్ గంగారం చెరువు, దుండిగల్ చిన్న దామెర చెరువు, మద్దెలకుంట చెరువు బైరామల్ గూడ, నల్లగండ్ల చెరువు, పెద్ద చెరువు ఫీర్జాదిగూడ, అంబీర్ చెరువు కూకట్ పల్లి, చిన్నరాయుని చెరువు అల్వాల్, దుర్గం చెరువు, ఉప్పల్ నల్ల చెరువు, సున్నంచెరువుల పరిరక్షణపై జీహెచ్ఎంసీ ప్రత్యేక దృష్టి సారించనున్నది.

దివ్యాంగులకు యూనిక్ డిజేబిలిటీ కార్డులు

సిటీబ్యూరో, మార్చి20 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ జిల్లాలో ఉన్న దివ్యాంగుల కోసం జారీ చేసే యూ